క్లుప్తంగా

తొట్టంబేడులో సామాజిక తనిఖీలు



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీలు నిర్వహించారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 27 పంచాయతీల్లో రూ.7.12,84,262 నిధులు కేటాయించినట్లు ఎంపీడీఓ తెలిపారు. పంచాయతీలో జరిగిన పనులను 12 మంది డీఆర్పీలు వివరించారు. ఇందులో భాగంగా కాసరం ఫీల్డ్ అసిస్టెంట్ బాలసుబ్రహ్మణ్యం మస్టర్లలో ఒకే సంతకాలు ఉండడంతో పాటు కుటుంబసభ్యులు పేర్లు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పీడీ అతనిని సస్పెండ్ చేశారు. రికవరికి రూ.1,36,298కు ఆదేశించినట్లు ఏపీఓ సుజాత తెలిపారు. పెనాల్టీ రూ.45,098 విధించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఏపీడీ ప్రేమ్‌కుమార్, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ వెంకయ్య, జిల్లా విజిలెన్స్ అధికారి శివయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువుతో సమాజాభివృద్ధి



ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

శ్రీకాళహస్తి: బాలికల చదువుతో సమాజాభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ నరసింహావర్మ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం బాలిక విద్య ఆవశ్యకత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల చదువుతో సమాజంలో పలు మార్పులు వస్తాయన్నారు. బుద్ధి బలంలో మహిళలు ముందుంటారని ఆయన అన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గంగారామ్, అధ్యాపకులు బాపనయ్య, సునీత, తులసి, సుభాషిణి, శివలక్ష్మి, రుద్రమదేవి, సుధీర్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



నాగలాపురం: యోగా–ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందని యోగా, ధ్యాన గురువులు మల్లీశ్వరి, రమేష్ తెలిపారు. మండల కేంద్రమైన నాగలాపురం పీహెచ్‌సీ ఎదురుగా ఏర్పాటుచేసిన యోగా–ధ్యాన కేంద్రాన్ని శుక్రవారం విశ్రాంత హెచ్‌ఎం నాగయ్య, రామలింగం, సుబ్రమణ్యం ప్రారంభించారు. యోగా గురువు రమేష్ మాట్లాడుతూ యోగా వల్ల మానవాళికి సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. కేంద్రంలో ప్రతి నిత్యమూ ఉదయం ఉచితంగా యోగా–ధ్యానంలో శిక్షణ ఇస్తామని తెలిపారు. ధ్యాన కేంద్రం చుట్టూ మొక్కలు నాటారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



చెరివిలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

సత్యవేడు: ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని స్విమ్స్ డాక్టర్లు పద్మావతి, హరిత తెలిపారు. మండలంలోని ఇరుగుళం, చెవిరి పంచాయతీల్లో శుక్రవారం స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. పింక్ బస్సులో మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు చేశారు. పురుషులకు నోటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్, రత్నమ్మ, ఎంపీడీవో కే.చంద్రశేఖర్, ఎంఈవో కే.రవి, స్టాఫ్‌నర్సు బి.ప్రియాంక, టెక్నీషియన్లు రెడ్డి ప్రసూన, ప్రసన్న లక్ష్మీ, పీహెచ్‌ఎన్ పవన్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు హరీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు



ఆక్రమణలు తొలగించి, నాటిన స్తంభాలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని సన్నిధివీధిలో రోడ్డు కిరువైపులా ఉన్న చిన్న చిన్న దుకాణలు తొలగించారు. అంతే కాకుండా రోడ్డుపైకి వచ్చిన నిర్మాణాలను కూడ తొలగించారు. తిరిగి ఆక్రమనలు జరగకుండా ఇనుప స్తంభాలను ఏర్పా టు చేస్తున్నారు. ఆలయ ఈఓ బాపిరెడ్డి సన్నిధివీధి ఆక్రమణల తొలగింపుపై చొరవ తీసుకున్నారు.

చెరువుల్లో జలకళ

- కలుజులు పారుతున్న చెరువులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- రబీ సాగుకు సిద్ధమవుతున్న వైనం

బుచ్చినాయుడుకండ్రిగ: ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. కలుజులు పారుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 32 చెరువులు ఉన్నాయి. వర్షాలతోపాటు తెలుగు గంగ కాలువ నీరు, కొండల నుంచి వస్తున్న ఊట నీరు చెరువులకు చేరుతోంది. ఈ క్రమంలో వారం రోజులుగా అన్ని చెరువులు కలుజులు పారుతున్నారు. దీంతో రైతులు రబీ సాగుకు సిద్ధమవుతున్నారు.



కలుజు పారుతున్న పల్లమాల చెరువు



పెద్దపాలేడు చెరువు



పార్లపల్లి చెరువు

సంఘమిత్రలను కొనసాగించండి



తీర్పు కాపీని అందజేస్తున్న సంఘమిత్రలు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని పొయ్యి, లింగమనాయుడుపల్లి, తాటిపర్తి, కొణతనేరి, కాసరం పంచాయతీ సంఘమిత్రలను యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర హైకోర్టు తీర్పు వెలువరించింది. ఆ తీర్పును అమలు చేయాలంటూ సంబంధిత సంఘమిత్రలు సీఐటీయూ నాయకలుతో కలిసి శుక్రవారం వెలుగు శాఖ పీడీకి వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి వెళితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్కీమ్ వర్కర్లపై రాజకీయ ఒత్తిళ్లు అధికమయ్యాయి. పలువురు సంఘమిత్రలపై తప్పుడు ఫిర్యాదులు చేయించి విధుల నుంచి తొలగించే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా తొట్టంబేడు మండలంలోని పొయ్యి సంఘమిత్ర మహాలక్ష్మి, లింగమనాయుడుపల్లి సంఘమిత్ర భూలక్ష్మి, తాటిపర్తి సంఘమిత్ర రేవతి, కొణతనేరి సంఘమిత్ర సరస్వతి, కాసరం సంఘమిత్ర మాధవి రాజకీయ, అధికార ఒత్తిళ్లకు గురయ్యారు. దీంతో వీరంతా రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు సంఘమిత్రల వాదనను సమర్థిస్తూ వారిని యథావిధిగా విధుల్లో కొనసాగించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతే కాకుండా వారికి బకాయి పడిన వేతనాలను వెంటనే చెల్లించాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర హైకోర్టు తీర్పుపై సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య హర్షం వ్యక్తం చేశారు.

కాజ్‌వేల మరమ్మతులు చేపట్టండి

నారాయణవనం: భారీ వర్షాలకు మండలంలో కొట్టుకుపోయిన లోలెవల్ కాజ్‌వేలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం తిరువట్యం కాజ్‌వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏటా నదీ ప్రవాహానికి కాజ్‌వేలు కొట్టుకుపోతున్నాయన్నారు. వాటికి తాత్కాలికంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించలేదని విమర్శించారు. తుంబూరు సర్పంచ్ నాగూరు, ఉప సర్పంచ్ చీరాలయ్య మాట్లాడుతూ కాజ్‌వేలు కొట్టుకుపోయి రాకపోకలు ఆగిపోయినా పట్టించుకున్న నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రాజేష్ మాట్లాడుతూ ఈ విషయాన్ని తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలిసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, సర్పంచులు నాగూరు, సుబ్రమణ్యంరెడ్డి, వైస్ ఎంపీపీ శివశంకర్, ఎంపీటీసీ పొన్నుస్వామి, నేతలు కిరణ్, రజని పాల్గొన్నారు.



కాజ్‌వేని పరిశీలిస్తున్న రాజేష్

మొక్కుబడిగా రెవెన్యూ సదస్సులు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని మన్నవరం, కలవగుంట సచివాలయాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా నిర్వహించారు. జిల్లా సాంఘిక సంక్షేమాధికారి చెన్నయ్య పర్యవేక్షణలో ఉదయం మన్నవరం సచివాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 14 అర్జీలు, కలవగుంటలో జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు 9 మంది అర్జీలు అందించారు. రెవెన్యూ సదస్సుల్లో శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీ నారాయణ తెలిపారు.

వెలవెలబోయిన రెవెన్యూ సదస్సులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం పెన్నలపాడు, కొన్నలి గ్రామాల్లో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులు వెలవెలబోయాయి. పెన్నలపాడులో నిర్వహించిన సదస్సులో 20 సమస్యలు వచ్చాయి. కొన్నలి గ్రామంలో నిర్వహించిన సభ వెలవెలబోయింది. 14 సమస్యలు మాత్రమే వచ్చాయి. తహసీల్దార్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించండి

రేణిగుంట(ఏర్పేడు): తమ భూములను భూసేకరించి, పరిహారం ఇవ్వలేదని, ఇప్పించాలని పల్లం గ్రామానికి చెందిన రైతులు రెవెన్యూ సదస్సులో అధికారులకు విన్నవించారు. ఏర్పేడు మండలం పల్లంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. టీటీడీ ఉద్యోగులకు ఇంటిస్థలాలకు ప్రభుత్వం తమ భూములను తీసుకుందని, అయితే పరిహారం ఇవ్వలేదని, పరిహార సొమ్మును ఇప్పించాలని రైతులు ఆర్డీఓకు అర్జీలు సమర్పించారు. తహసీల్దార్ భార్గవి, డీటీ రోజారమణి పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట మండలం మామండూరు పంచాయతీ బాలుపల్లిలో తహసీల్దార్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ప్రత్యేక అధికారి రాఘవయ్య, బాలాజీ పాల్గొన్నారు.

లింక్ రోడ్డు ఏర్పాటు చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామం నుంచి తెర్రిపాడు గ్రామానికి లింక్ రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. తెర్రిపాడులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామస్తులు పలు భూసమస్యలను ఏకరు వు పెట్టారు. తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, సర్పంచ్ రామ్మూర్తి పాల్గొన్నారు.

పరిహారమివ్వాలని వినతి

వరదయ్యపాళెం: మండలంలోని వితయ్యపాళెంలో ఏపీఐఐసీకి కేటాయించిన 30 ఎకరాలకు పరిహారం చెల్లించాలని ఆ గ్రామ రైతులు కోరారు. వితయ్యపాళెంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో వారు తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆర్‌ఐ శివకుమార్, మండల సర్వేయర్ రమణ, సర్పంచ్ ఆనందబాబు, వీఆర్వోలు రవి రెడ్డి, నాగభూషణం, మాధవి, ఎఫ్‌ఎస్‌ఓ దేవరాజులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలు

నాగలాపురం: రైతుల భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. నాగలాపురం మేజర్ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు.

అమ్మవారి సాక్షిగా ఆధిపత్య రగడ



కమిటీ సభ్యుల మధ్య వాగ్వాదం

రేణిగుంట: పట్టణంలోని బిస్మిల్లానగర్‌లో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయంలో ఆధిపత్యం కోసం అమ్మవారు ముందే శుక్రవారం కమిటీ సభ్యులు రెండు బృందాలుగా విడిపోయి కొట్టుకున్నారు. రేణిగుంటలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయం స్థానికంగానే కాక బయట ప్రాంతాల్లో కూడా ప్రసిద్ధి చెందింది. ఆలయ వ్యవస్థాపకులు లక్ష్మణాచార్యులు విదేశాల్లో స్థిరపడడంతో అతని కుమారుడు మూర్తి స్వామి, ట్రస్టు సభ్యుల ఆధిపత్య పోరు నెలకొంది. అందులో భాగంగానే శుక్రవారం భక్తులు అమ్మవారి సేవలు జరుగుతుండగా ఇరు వర్గాల వారు గొడవపడ్డారు. గాజులమండ్యం పోలీసులకు సమాచారం అందడంతో వారు ఆలయం వద్దకు చేరుకుని ఇరువర్గాలవారిని పంపించడంతో గొడవ సద్దుమణిగింది. 35 ఏళ్లుగా అమ్మవారికి తామే సేవ చేస్తున్నామని మూర్తిస్వామి, కొన్ని సంవత్సరాల క్రితం వచ్చి మొత్తం తన సొంతం చేసుకోవాలనే దురుద్దేశంతో ప్రవర్తిస్తున్నారని ట్రస్టు సభ్యురాలు రుక్మిణి ఆరోపిస్తున్నారు.

వివాదాల్లో మూర్తిస్వామి..

ఇటీవల ఆలయానికి వచ్చిన ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారని రేణిగుంట పోలీస్‌స్టేషన్‌లో ఆలయ ప్రధాన పూజారి మూర్తిస్వామిపై కేసు నమోదై ఉంది. అయితే అప్పట్లో విదేశాలకు పారిపోయిన ఆయన బెయిల్‌పై వచ్చి మళ్లీ ఆలయంలో యథావిధిగా పూజా కార్యక్రమాలు చేస్తున్నారు. అయితే తమ ప్రమేయం లేకుండా ఆలయంలో ఆయన చేస్తున్న పెత్తనంపై కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా ప్రాకారోత్సవం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం అమ్మవారికి విశేష ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ ఉత్సవమూర్తికి విశేషాలంకరణ చేశారు. అనంతరం ఆలయంలో ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కల్యాణ వెంకన్నకు ఘనంగా శ్రవణోత్సవం



తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంత్రం ఉత్సవర్లు మాడవీధిలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కల్యాణ వెంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణ గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. ఆర్జితం అధికారి భరత్ ఉత్సవాన్ని పర్యవేక్షించారు.

పరిసరాల శుభ్రతతో జ్వరాలకు చెక్



జ్వరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని మండల వైద్యాధికారి దివాకర్ తెలిపారు. వెస్తువరత్తూరులో శుక్రవారం పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి చుట్టు గుంతలు, పొదలు, పేదదిబ్బలు లేకుండా చూడాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని, అవి కుట్టడం వల్ల డెంగీ, మలేరియా, చికున్ గునియా, మెదడువాపు, బోదకాలు తదితర జ్వరాలు ప్రబలుతాయన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత సేవలు సద్వినియోగం చేసుకోండి



రేణిగుంట: మాట్లాడుతున్న ఎంఈఓ ఇందిరాదేవి

రేణిగుంట: దివ్యాంగ పిల్లల కోసం ప్రభుత్వం నడుపుతున్న భవిత కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని రేణిగుంట ఎంఈఓ ఇందిరాదేవి కోరారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రేణిగుంట భవిత కేంద్రంలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రఘుప్రసాద్, ఐఈఆర్‌టీలు జేష్మ, బిందు, స్పెషల్ టీచర్ చంద్రబాబు, జనార్దన్‌రాజు, అరబిందో సంస్థ సిబ్బంది రాజేష్, ప్రవీణ, కౌసల్య పాల్గొన్నారు.

ఏర్పేడులో...

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. ఎంఈఓ ప్రేమలత మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఎంతో ప్రతిభా,పాఠవాలు దాగి ఉంటాయన్నారు. ఏర్పేడు పాఠశాల హెచ్‌ఎం శోభారాణి, ఐఈఆర్‌టీలు స్వర్ణలత, రమాదేవి, ప్రజాప్రగతి ట్రస్ట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైవిధ్య పంటసాగు ప్రోత్సహించాలి

శ్రీకాళహస్తి: వైవిధ్య పంట సాగుకు రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య అన్నారు. శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఏపీ సీడ్స్ సమావేశ మందిరంలో శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు వేణుగోపాలరావు, కల్యాణి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా అంబేడ్కర్ వర్ధంతి

శ్రీకాళహస్తి: పట్టణంలో వాడవాడలా శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆర్టీసీ బస్టాండ్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కరీముల్లా, సుబ్బరామయ్య, అంటోని, ధనకుమార్, అన్సర్, చందు, పురుషోత్తం, చంద్రమౌళి, బద్రి, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. వెంకటముని, నాగూరయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగు జాడల్లో నడుద్దాం

సత్యవేడు: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. సత్యవేడులో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో లాయర్ వెంకటేశ్వర్లు, కుబేంద్రన్, ఈ.గోవిందస్వామి, అరుల్, లాయర్ రాజ, రమణయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్‌కు నివాళి

నాగలాపురం: మండలంలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని జరుపుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేష్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, సోషల్ మీడియా ఇన్‌చార్జి దేశప్పన్, కృష్ణాపురం సర్పంచ్ మహేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం : స్వతంత్ర భారతావనికి దశ, దిశను నిర్దేశించిన బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దామని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. నారాయణవనం బైపాస్ వైఎస్సార్ కూడలి వద్ద శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేష్ మాట్లాడుతూ బలహీన వర్గాలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగి సమాజ నిర్మాణంలో కీలక భూమిక పోషించినప్పుడే అంబేడ్కర్ కలలు నెరవేరినట్టు అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, నాయకు లు అన్నాదొరై, కిరణ్, గురుస్వామి, రాజారెడ్డి, సర్పంచులు సుబ్రమణ్యంరెడ్డి, ధర్మలింగం, నాగూరు, మురళి, వైస్ ఎంపీపీ శివశంకర్, ఎంపీటీసీలు పొన్నుస్వామి, శంకరయ్య, మార్కండేయరెడ్డి, పీజీ బాబు, తిరువెంగడం, అశోక్, కేశవులు, ఏలుమలై, గోవిందస్వామి పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

బుచ్చినాయుడు కండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: భారతరత్న బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం బుచ్చినాయుడు కండ్రిగలో జరుపుకున్నారు. మండల అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు ఉగ్గుమూడి గురునాథం, మాజీ సర్పంచ్ గెడితొట్టి గురవయ్య, కమిటీ సభ్యులు దేవకుమార్, సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, వైద్యాధికారి దివాకర్, దశకుమార్, మునిరత్నం, రవి పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం రేణిగుంటలో నిర్వహించారు. రేణిగుంటలోని అంబేడ్కర్ విగ్రహానికి వివిధ పార్టీ నాయకులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రేణిగుంట సర్పంచ్ నగేషం, సీపీఐ నాయకుడు తులసి రాజన్, మండల కో ఆప్షన్ సభ్యుడు హాసన్ సాహెబ్, జూలియస్ రాజు, డాక్టర్ గౌరీ, నరసింహారెడ్డి, ఐజయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే రేణిగుంటలో రైల్వే సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు జయంత్‌కుమార్, బ్రాంచి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా హెచ్‌ఎం రూపేష్ కుమార్ అధ్యక్షతన 9, 10 తరగతి విద్యార్థులకు రామాయణం, పెద్దబాలశిక్ష పుస్తకాలను అమృత భారతి ఫౌండేషన్ చిత్తూరు సమన్వయకర్త శతావధాని ఆముదాల , సభ్యులు లోకేష్ అందించారు. టీచర్లు యువశ్రీ మురళి, సురేష్‌బాబు, నాదెండ్ల మురళి, ప్రసాద్, వేణుగోపాల్, దాసు, మాధవీలత, దేవేంద్ర, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.